# అభిమానాలు

'టెలిగ్రాం అందిందిరా శ్రీపతీ?' అనడిగాడు శేషావతారం తలుపు తియ్యగానే.

''ఆఁ ఆఁ టెలిగ్రాం అందకపోవడమేమిటి! అందింది. నిన్ను చూసి ఎన్నాళ్లయిపోయిందిరా... రారా.. అర్థరాత్రి కావస్తోంది. ఇక స్నానం ఏం చేస్తావ్... కాళ్లూ చేతులూ కడుక్కుని బట్టలు మార్చుకో ... పలహారం చేద్దువుగాని ... రైలు లేటు కదూ ....''

'' ఏం అన్నయ్యగారూ, చాలా రోజులకి మీరు రావడం మళ్లీ ... వదినగారూ, పిల్లలూ బాగున్నారా ?''

'' ఆఁ బాగున్నారమ్మా...'' శేషావతారం చెప్పిన జవాబు విని ''అదేమిట్రా అదోలా ఉన్నావ్...'' అని అడగాలనిపించింది. అయినా నిగ్రహించుకున్నాడు శ్రీపతి.

'' సూట్‌కేసు మేడమీద పెట్టండి ... నే వెళ్లి కొంచెం వేన్నీళ్లు పడేస్తా ... కూచోండి అన్నయ్యగారూ...'' ప్రియంవద వంటింట్లోకి వెళ్లింది.

''తీరా స్టేషనుకు వచ్చాక టెలిగ్రాం ఇయ్యాలనిపించింది. నా కంటే ముందొస్తుందనుకోలేదు...''

మిత్రుడి మౌనాన్ని గమనించాడేమో శేషు మాటలందుకున్నాడు.

''ఏరా చిట్టీ. పెద్దాడెక్కడున్నాడు ?''

'' ఆ చివరకి విసిరేశారు - శ్రీకాకుళం.... రా మేడమీదకు పోదాం....''

శ్రీపతి సూటుకేసు అందుకోబోయాడు.

''నే తీసుకొస్తాలేరా, నీ కెందుకు శ్రమ !''

శేషావతారం సూటుకేసు ఇవ్వలేదు -

'' ఊరు మారిపోయింది సుమా, చీకట్లో ఇల్లు వెదుక్కోలేకపోతే ఏ హోటల్‌లోనో పడుకుందాం అనుకున్నా ... కాని ఇదిగో ఈ పార్కుందే అదే నాకు ఆనవాలు. తప్పిపోకుండా ఆటోవాడు తీసుకొచ్చేశాడు.''

శ్రీపతికి మాత్రం శేషు మాట తీరులో ఏదో వింత పొడచూపింది. అయినా ప్రశ్నలు వెయ్యడం వల్ల ఉపయోగం ఉంటుందనిపించలేదు.

రిటైర్‌మెంట్ దగ్గర పడుతున్నవాళ్లు - ఎదురువాడు ప్రశ్న వేసినంత మాత్రాన మనసులో మాట చెప్పేసేటంత చిన్న వయసు కాదు వాళ్లది.

ఆఫీసు పని మీద వస్తున్నట్టు శేషు టెలిగ్రాం ఇచ్చాడు -

చాలా సార్లు ఇక్కడికి వచ్చాడు. ఏడాదికో రెండేళ్లకో ఓసారి రావడం పరిపాటే. వచ్చినప్పుడల్లా మరో దగ్గర దిగడమనేది ఎన్నడూ జరగలేదు - శ్రీపతిది సొంత ఇల్లు - యాభై ఐదేళ్ల స్నేహం సాహచర్యం వాళ్లది. శ్రీపతి భార్యకూ శేషావతారం భార్యకీ కూడా ముప్పయి ఐదేళ్లదోస్తీ - వాళ్ల మధ్య అరమరికలు లేవు.

అయితే అతను టెలిగ్రాం ఇవ్వడంలోనే ఆశ్చర్యం ఉంది మరి. '' తువ్వాలు ఇలా పడెయ్యరా!'' అంటూ బాత్‌రూంలో నుంచి అడిగాడు.

"ఓయ్ ! తువ్వాలు..." శ్రీపతి వాళ్ల ఆవిడకి కేకేశాడు. కాని మనసులో ఏదో తళుక్కున మెరిసింది. మిత్రుడి మాటల్లో ఏదో తొందర - తొట్రుపాటు - ఇప్పుడు తువాలు ... సూట్‌కేసు . వాళ్ల ఆవిడ సర్ధకుండా ఆఫీసు పనిమీద శేషు ఇంతదూరం రాడు. అది శ్రీపతికి తెలుసు.

శ్రీపతి ఆలోచనల మూలాన్నో ఏమిటో అతని మాటలు తగ్గిపోయాయి - మౌనంగా ఉండి ఏదో ఆలోచిస్తున్నాడు.

"ఏమిట్రా అదోలా ఆలోచిస్తున్నావ్!" అని శేషు అడిగేశాడు.

"ఏం లేదు ... ప్రయాణం బాగా జరిగిందా ?"

"ఆఁ!..."

వాళ్లిద్దరూ కలిస్తే గంటల తరబడి అలా మాటాడుకుంటూనే ఉంటారు. అలాంటిది ఆ సంభాషణ ఎక్కడికక్కడ పుటుక్కున తెగిపోతోంది.

"పిల్లలంతా బాగున్నారా ?"

"ఆఁ! ... మీ వాడి దగ్గరి నుంచి ఉత్తరాలు వస్తున్నాయా ? చంటాడు బాగున్నాడా ?"

- "రండి అన్నయ్యగారూ ... ఫలహారం పెట్టేశా ...."

"అసాధ్యురాలివమ్మా, అప్పుడే చేసేసావూ ?"

శేషయితే మామూలు ధోరణిలోకి వచ్చేసినట్టనిపించింది కాని శ్రీపతి అత్రం మాత్రం చిక్కబడిపోయింది.

ఫలహారం కాగానే మేడమీదకి వెళ్లిపోయారు.

-"అరెరె! అన్నగారప్పుడే నిద్రపోయారే!"

"ప్రయాణం బడలిక కదా !" శ్రీపతి సర్ది చెప్పాల్సి వచ్చింది - అతనికీ నిద్ర రాలేదు. అటూ ఇటూ కదులుతూనే ఉన్నారు ఇద్దరూ.

"మీ ఆఫీసు దగ్గర డ్రాప్ చేస్తా !" అన్నాడు శ్రీపతి ఆఫీసుకు బయలుదేరుతూ.

"ఇంత పెందరాడే ఎందుకులే - కాస్త తీరికగా వెళతా. బస్సులో వెళతాలే" అన్నాడు శేషు. శ్రీపతి మరేం అనకుండా స్కూటరు తీసి ఆఫీసుకు బయలుదేరి పోయాడు.

వాడి ఆలోచన ఒకటై ఉంటుందని అనిపించింది శ్రీపతికి ఆఫీసుకు వెళ్లి వచ్చిన తరువాత అక్కడ జరిగిన గొడవ చెబుతాడేమోనని సర్దిపుచ్చుకున్నాడు.

శేషుగాడి మనసులో ఏదో ఆరాటం. ఏదో దిగులు ఎందుకో బయటకు చెప్పడం లేదు.

లంచ్ టైమ్‌లో ఇంటికి రావడం చూసి

"ఏం, ఒంట్లో బాగులేదా ?" అంటూ ప్రియంవద సావిట్లోనే అడిగింది.

"శేషు గాడు ఆఫీసుకు వెళ్లాడా ?"

"లేదే! భుక్తాయాసంగా ఉందని మేడమీద కెళ్లి పడుకున్నారు... కాఫీ చెయ్యనా ?"

"ఆఁ!"

ప్రియంవద వెనకాలే వంటింట్లోకి వెళ్లి టేబిల్ దగ్గర కూచున్నాడు శ్రీపతి.

"చిట్టిగాడు ఆఫీసుకీ వెళ్లలేదన్నమాట... ఇదిగో ఇటురా ..."

ప్రియంవద స్టౌ మీద కాఫీ నీళ్లు పడేసి భర్త దగ్గరగా వచ్చింది.

'' వాడేమయినా చెప్పాడా ?''

'' లేదు .... ఇంతకీ ఏం జరిగిందిట ? మీరెందుకలా ఉన్నారు ?''

శ్రీపతి ఏమీ అనలేదు – భర్త ముఖం చూసి ప్రియంవద మళ్లీ ఏమీ అడగలేదు.

కాఫీ గ్లాసు క్రింద పెడుతూ అన్నాడు.

'' వాడు ఏదో గొడవ పడి వచ్చినట్టున్నాడు. ఆఫీసు గొడవైవుండదు. ఉంటే ఆఫీసుకు వెళ్లకుండా ఉండడు. ఇంట్లో మీ వదినతో మాటా మాటా అనుకుని ఉండవచ్చు. వాడి మౌనం అసహజంగా ఉంది.''

''ఒగంట నువ్ మౌనంగానే ఉండిపోతే వాడే బయటపడవచ్చు.

'' లేదా నువ్ కాస్త ఆరా తియ్యి.'' శ్రీపతి మిత్రుడిని లేపకుండానే మళ్లీ ఆఫీసుకి వెళ్లిపోయాడు.

సాయంకాలం నాలుగు తరువాత నిద్రలేచిన శేషావతారం నేనలా వెళ్లివస్తా అని చెబుతూ ఉంటే ప్రియంవదకి తను అనుకున్నదే నిజమనిపించింది. 'మంచిదన్నయ్యగారూ!' అంటూ వీధి వరకూ వెళ్లి సాగనంపింది. మరి ఆఫీసు పనే నన్నమాట – అధికారులతో తీరికగా మాటాడాలంటే ఆఫీసు పని సందడి తగ్గాక ఇంటి దగ్గరో మరెక్కడో మెల్లగా మాటాడాలి. కొంచెం స్థిమిత పడింది ఆవిడ మనసు.

– సాయంకాలం వంట పూర్తయి భర్తకోసం ఎదురు చూస్తున్న ప్రియంవదకి ఆయనగారు ఎనిమిదయినా ఇంటికి రాకపోయేసరికి మిత్రులిద్దరూ కలసి ఏ సినిమాకో వెళ్లారేమోననిపించింది.

స్కూటరు శబ్దం విని బయటకు వచ్చిన ప్రియంవదకి భర్త ఆఫీసులో పనిచేసే శంకర్ '' నమస్తే ఆంటీ !'' అంటూ పలకరించాడు.

'' శ్రీపతిగారు ఆఫీసులోనే ఉన్నారు. కొంచెం ఆలస్యమవుతుందని చెప్పి రమ్మన్నారు... బండి ఆయనదే ... ''

చివరి మాట వినగానే ప్రియంవదకి ఏదో అనుమానం, భయం వేసింది... కొంపదీసి.... మరి ఆలోచించదలచుకోలేదు – 'మా వారి స్నేహితుడు' – అని ఏదో అడగాలనుకున్నా ఎలా అడగాలో తెలియక ఊరుకుండిపోయింది. ఆ మాట చెప్పేసిన శంకర్ ''వస్తా '' నంటూ వెళ్లిపోయారు.

–'' ఇదేమిటమ్మా, ఇక్కడ కూచున్నావ్!'' అంటూ శేషావతారం రానే వచ్చాడు.

''ఏం లేదన్నయ్యగారూ ! వచ్చేసరికి ఆలస్యమవుతుందని ఆయన కబురు చేశారు...'' అంటూ మెట్లమీద కూచున్న ప్రియంవద లోపలికెళ్లింది.

శేషావతారం కాళ్లూ చేతులూ కడుక్కొని సావిట్లోకి వచ్చి కూచున్నాక అడిగింది ప్రియంవద.

ఆయన వచ్చేసరికి ఎంత ఆలస్యమవుతుందో మీకు వడ్డిస్తా! భోజనానికి లేవండి అంటూ–

'' వద్దమ్మా, వాడూ-వచ్చాక అందరం ఒకేసారి కూచుందాం...''

''అబ్బాయి పెళ్లిగురించి ఏమయినా అనుకుంటున్నారా ? వదిన గారికి కోడలొచ్చేస్తే మీ బాధ్యతలు చాలా భాగం తీరిపోయినట్టే....''

''ఏం పెళ్ళిళ్ళో – ఏం బాధ్యతలో – '' శేషావతారం నిట్టూర్చాడు. ఆఫీసుపని అయి ఉండదని అనిపించింది ప్రియంవదకి.

పది దాటిన తరువాత ఇంటికి వచ్చాడు శ్రీపతి.

"ఏం రా ఇంత ఆలస్యం ?"

"ఏవో గొడవలుగా ఉన్నాయి... నువ్వెక్కడికి వెళ్లిపోయావ్ ?"

శేషావతారం జవాబు చెప్పలేదు.

స్నేహితులిద్దరికీ వడ్డిస్తుంటే శేషావతారం – "అదేమిటమ్మా, ఇంత రాత్రయిపోయింది నువ్వొక్కతివే వెనక్కేం ఉంటావ్. నువ్వూ కంచం వేసుకో. అంతా కలిసే భోజనం చేద్దాం !" అన్నాడు.

ముగ్గురూ మౌనంగా భోజనాలు సాగిస్తున్నారు. వచ్చినాయన దిగులుగా ఉండడంలో కారణమేమై ఉంటుందో తెలియనే తెలియదు. ఈయన ఇంత ఆలస్యంగా ఇంటికి రావడమేమిటో అని ప్రియంవద ఆలోచిస్తోంది.

"నీతో ఓ మాట చెప్పాల్రా," శ్రీపతి హఠాత్తుగా అన్నాడు. శేషావతారం కంగారుగా ఆయన వంక చూడడం ప్రియంవద గమనించింది.

"మీవాడికి మంచి సంబంధం ఒకటొచ్చింది..."

"మా వాడికా ..."

"అవున్రా ... ఇంకెన్నాళ్లు ఆగుతాడు ... నువ్ చెయ్యకపోతే వాడే చేసేసుకుంటాడేమో !"

"చేసుకోలేదని ఏమిటి నీ నమ్మకం !"

– సూటిగా, నిక్కచ్చిగా ఇలా శేషావతారం తన మనసులోని బాధను వ్యక్తం చేస్తాడనుకోలేదు శ్రీపతి.

"అదేమిట్రా అలా అంటావ్! మనవాళ్లు అల్లాంటి వాళ్లు కాదు ... మనమూ అలాంటి వాళ్లం కాదు ....

"రెండూ పొరపాటేమో .... విను.

"మా వాడు నీ కొడుకులా బుద్ధిమంతుడు కాదు. వాడెవరో అమ్మాయిని నచ్చి చేసేసుకుంటున్నాడన్నమాట మీ చెల్లెలు దాచిదాచి మొన్ననే చెప్పింది. – నాకేం చెయ్యడానికీ తోచక ఆఫీసు పనని చెప్పి ఇక్కడి కొచ్చాను. వాడు ఏదో నిశ్చయం చేసుకున్న తరువాత ఇక మనం చెప్పడానికేముంది.... వాడి ముఖం చూడాలనిపించడంలేదు ...." శ్రీపతి ముఖం వంకే చూస్తోంది ప్రియంవద. అతని కళ్లల్లో ఎర్రజీర వచ్చింది. గొంతుకించిత్ వణుకుతోంది. ఆవేశం అదుపులో పెట్టుకోవడానికి ఆయన శత విధాల ప్రయత్నం చేస్తున్నట్టనిపించింది ఆవిడకి.

కంచంలోనే చెయ్యి కడుక్కుంటూ శ్రీపతి అన్నాడు "నువ్ తొందరపడిపోతున్నావ్. వాడు నీ కొడుకు – తొందరపడి ఏ పనీ చెయ్యడు. నీకు నచ్చని పని అసలు చెయ్యడు. అంత మట్టుకు నాదీ పూచీ... ఇక పిల్లని ఇష్టపడటం అంటావా – అది తప్పని ఎవరనగలరు ? వయసొచ్చింది – జీవితం ఒక గాడీలో పడింది – వాడి ఆనందం కంటే నిజం చెప్పు నీక్కావలసిందేముంది ?..."

"ఇప్పుడు వాడి ఆనందం వాడే వెదుక్కుంటున్నాడు..... ఎవరి ప్రమేయం లేకుండానే...."

"చూడరా నాయనా, వాడు కాలేజీలో చేరినప్పటి దగ్గర నుంచీ మనం వాడికి చెప్పినదంటూ ఏముంది ? ఏం చదవాలీ ఎలా చదవాలీ అన్నీ వాడి మట్టుకు వాడే నిర్ణయించుకుని ఏం చెయ్యాలో వాడికి వాడుగా తెలిసిన వాళ్ల దగ్గర నుంచి మెలుకువతో నేర్చుకుని స్వయంకృషితోనే

చదివాడు – వాడే బాగా చదివి ఉండకపోతే డొనేషన్లు పోసి మనం వాడిని చదివించ గలిగే వాళ్లమా – ఏనాడూ మనని ఏ విషయంలోనూ బాధించలేదు – మనసుకి కష్టమూ కలిగించలేదు– నీతో చెప్పకుండా ఓపిల్లకి మనసిచ్చాడని నీకు తెలిసింది – నీకు కోపం వచ్చింది ....కాదు – ఉడుకుమోత్తనం వచ్చింది – ఆ పిల్లకి మనసివ్వాలనుకున్నప్పుడు నీకు చెప్పాలన్న జ్ఞానం వాడికి లేదు – రాలేదు – కాని అది జీవ ధర్మం .... నువ్వంటే వాడికెంత ఇదో నీకు చెప్పాల్సిన అవసరం లేదు – నువ్ కొంచెం హుందాగా, వాడి మనసు నొప్పించకుండా వాడి మంచి కోరి వాడిని ఆశీర్వదించడం మంచిది. నీతో మాట మాత్రమైనా చెప్పలేదని నీ దుగ్ధ తప్పు ! ... ఏ పిల్లని వాడు నచ్చుకున్నా – సాంప్రదాయం అవీ సరిపోతే నీకు అభ్యంతరం ఉండదు కదా !''

శేషావతారంలోని ఆవేశం ఏమైందో అతని ముఖం ప్రసన్నంగా మారడం మాత్రం ప్రియంవద గ్రహించింది.

'' ఇంతకీ మీరు ఏదో సంబంధం చెబుతున్నారు ...''

'' చెప్పనీయమ్మా కన్నవాడిని నాకింత గౌరవం ఇచ్చాడు ... ఇక వీడికీ ఇస్తాడు '' – మళ్లీ ఉద్రేకం మాటల్లో తొణికింది. '' చూడరా అబ్బాయ్ ! వాడి ఆనందాన్ని మనం కాదనడం విజ్ఞతకాదు – ఇంతకీ ఆ పిల్ల ఎవరో తెలుసుకున్నావా ?''

'' లేదు – ''

'' తెలుసుకోకుండానే కాదంటున్నావా ? ఒరేయ్ మనమందరం ఒక లాంటి వాళ్లమేరా. మనసులో ఏదీ దాచుకోలేం – నువ్ ఇక్కడికి వచ్చినప్పటి నుంచీ – కాదు – నీ టెలిగ్రాం అందినప్పటి నుంచీ నాకు ఏదో అనుమానంగానే ఉంది. నిన్ను చూసిన తరువాత అనుమానం తీరిపోయింది. నువ్వు పనిమీద రాలేదు, మీ ఆవిడతో పోట్లాడి, చెప్పకుండా వచ్చేశావ్. రాగానే తువాలు అడిగేసరికి నాకు విషయం వాసన కొట్టింది. అయినా నువ్వే చెబుతావని ఆగాను. మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి నువ్ నిద్రపోతున్నావ్. రెండురోజులై నిద్రపోలేదు కాబట్టి – ఆఫీసుకు మా చెల్లెమ్మ ఫోన్ చేసింది. విషయమంతా పూసగుచ్చినట్టు చెప్పింది – వెర్రివాడా ఆమెను కష్టపెట్టి నువ్వేం బావుకుంటావ్! ఆడమనిషి కాబట్టి నిన్ను తల్లిగా తన బిడ్డనూ ఆవిడ తెలుసుకున్నట్టు – ఆవిడ మిమ్మల్ని అభిమానించినట్టు ఎవరు అభిమానించగలరు చెప్పు ... ఆ రెండు రోజులు ఆమెతో మాటాడడం మానేసి, చివరికి ఇంట్లో భోజనమైనా చెయ్యకుండా బయలుదేరి వచ్చావట.... ఆమె చెయ్యగలిగిందేముందని – చేసిన తప్పేమిటని నీ ఉద్దేశం – ఇది ధర్మమేనా – వయసొచ్చిన మనకెవ్వరు చెప్పగలరు ?.... ఒరే, చెల్లెమ్మ దగ్గర నుండి విషయం తెలుసుకున్నాక నాకు మనసుండ బట్టక మీ వాడి ఆఫీసుకి ఓ టెలిగ్రాం ఇచ్చాను. రాత్రి పదిగంటలయ్యాక నాతో ఫోన్‌లో మాటాడమని – వాడు నాకు అన్నీ చెప్పాడు. ఆ సంబంధం నిజంగా నీకు నచ్చకపోతే వాడు చేసుకోడు – సరేనా ...''

'' అది కాదురా ...'' శేషావతారం ఏదో చెప్పబోయాడు. '' నీసంగతి నాకు తెలుసు. తాటాకు మంటలాంటిది నీకోపం – సర్రున తారాజువ్వలా లేచిపోతావ్. ముందే చెబుతున్నా విను. నేను నీ మీద కుట్ర చేశానని నువ్వనుకుంటే లాభంలేదు. మీ వాడు బెజవాడలో ఉద్యోగంలో చేరిన కొద్దిరోజుల్లోనే అక్కడికి వెళ్లి వాడిని చూశాను కదా ! అక్కడ నా స్నేహితుడితో వాడికి పరిచయం

చేశాను. ఆ నాటికి నా మనసులోనూ ఆ శాంతయ్య కూతురికీ, మీ వాడికీ ఈడు జోడూ బాగుంటుందని నాకు తెలియదు - శాంతయ్యని చార్టర్డ్ ఎకౌంటెంట్ లే.

''నేను కాలేజీ వదిలేసిన తరువాత అతనితో స్నేహమయింది. బెజవాడలో అద్దె ఇంట్లో ప్రక్క ప్రక్క పోర్షన్స్‌లో ఉండేవాళ్లం. అసలు వాళ్లిద్దరినీ సంధానపరచిన వాడిని నేను - ఆమాట ముందే చెబుతున్నా. నా మీద కోపం తెచ్చుకోకు.

'' ఇక మరొక్క విషయం నీకు కట్నకానుకలమీద పట్టింపులు లేవని నాకు తెలుసు - వాడికి నచ్చిన పిల్లతో నీ చేతుల మీదుగా పెళ్లి జరిపిస్తే ఎంత గ్రేస్‌ఫుల్‌గా ఉంటుంది ! వాడి మీద నీకెంత ప్రేమో నాకు తెలియదూ ! - వాడికి నీ మీదెంత గౌరవమో నాకు చెప్పాడు - నిజంగా నువ్ సంబంధం కాదని అంటే వాడు నువ్ ఆమోదించిన సంబంధమే చేసుకుంటాడట !''

భర్త అంత వివరంగా అనునయంగా చెబుతూ ఉంటే శేషావతారం ముఖంలో మారుతున్న రంగుల్ని తదేకంగా చూస్తున్న ప్రియంవద మరి ఆగలేకపోయింది.

'' ఇంతకీ మనవాడు, పెళ్లి చేసుకోవాలనుకుంటున్నది విశాలాక్షి గారి అమ్మాయినేనా ? - మరే - మంచి వాళ్లు - సమాన వియ్యం ...''

ప్రియంవద బోల్డు సంతోషించింది.

'' మనం ఇంక నిద్రపోకపోతే .... శాంతయ్య వచ్చేసరికి ఇంకా నిద్రలోనే ఉంటాం... శాంతయ్యని గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి నేరుగా మనింటికి రమ్మని చెప్పేశా - లాంఛనంగా ఆయన అడిగినప్పుడు ... ''

'' ఆగండాగండి .... అన్నగారిని అడిగేస్తే సరిపోతుందా- పెళ్లికొడుకు తల్లినీ అడగాల్సిందే. అన్నగారూ మా వదినగారిని అడగకుండా మీరీ సంబంధం ఎలా ఒప్పుకుంటారో నేనూ చూస్తా!'' అంది ఠక్కున లేచి నుంచున్న ప్రియం వద.

- '' మనవాళ్ల అభిమానాలలాంటివి.'' అన్నాడు ప్రఫుల్లంగా చిరునవ్వుతో శేషావతారం.

**ఆకాశవాణి, విశాఖపట్నం ప్రసారం**

8-2-90